సాక్షి
పల్నాడు
మంగళవారం, 15, జులై, 2025



వైభవంగా స్వామి వారి కల్యాణం

నగరంపాలెం: గుంటూరులోని శ్రీగౌరీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శతాబ్ది మహోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట: ఇస్సపాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి దివ్వెల శివశంకరరావు జ్ఞాపకార్థం వారి వారసులు రూ.1,01,116 నగదును అందజేశారు.



దుర్గమ్మ సేవలో చాగంటి దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు దంపతులు సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

పల్నాటి సంస్కృతిని చాటి చెప్పిన మురళి

సత్కరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట: జాతీయ స్థాయిలో పల్నాడు జిల్లా సాంస్కృతిక వారసత్వ విలువను ఇనుమడింపజేస్తూ 'జాతీయ ఉత్తమ నేత వృత్తిదారు' అవార్డు పొందిన సత్తెనపల్లి వాసి కర్నాటి మురళిని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సత్కరించారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న అధికారులు, అర్జీదారుల సమక్షంలో కర్నాటి మురళిని అభినందించారు. కర్నాటికి దక్కిన అవార్డు పల్నాడు జిల్లా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అన్నారు. జిల్లాలోని కళాకారులు మరిన్ని అవార్డులు, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డీఆర్వో మురళి, జిల్లా చేనేత, జౌళి పరిశ్రమల అధికారి ఉదయకుమార్, ఆర్డీవో మురళి పాల్గొన్నారు.

వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో సోమవారం సంకటహరచతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మాచర్ల మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై కేసు



వెల్దుర్తి: మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్, మరో ఇద్దరిపై వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదయింది. 2022లో పార్టీ మారమని టీడీపీ నాయకుడు దారపునేని శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేసినట్లుగా కేసు నమోదయింది. దీనిపై దారపునేని ఆదివారం ఫిర్యాదు చేయగా కిషోర్‌తో పాటు మండలంలోని బోదిలవీడు గ్రామానికి చెందిన మేదరమెట్ల శ్రీను, పంగులూరి బాబురావులపై హత్యాయత్నం కేసును పోలీసులు నమోదు చేశారు. కాగా ఇప్పటికే పలు అక్రమ కేసులతో కిషోర్‌ను ఇబ్బందులకు గురిచేస్తూ, కక్షసాధింపులకు దిగిన కూటమి నేతలు మూడేళ్ల నాటి ఘటనను బూచిగా చూపి మరో అక్రమ కేసు నమోదు చేయించారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఓడీఓపీ అవార్డు అందుకున్న కలెక్టర్ నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: ఒకే జిల్లా–ఒకే ఉత్పత్తి కింద గుంటూరు మిర్చికి జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి దక్కడం చాలా గర్వంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా బంగారు కేటగిరి అవార్డును కలెక్టర్ అందుకున్నారు. కలెక్టర్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త, కేంద్ర సహాయ వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి జితిన్ ప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ, ,చేనేత పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సునీతలు అభినందించారు.

ఇసుకాయ స్వాహా



- కృష్ణానది రీచ్‌లలో బరితెగిస్తున్న ఇసుకాసురులు
- పెద్ద పెద్ద యంత్రాలు పెట్టి అక్రమంగా తవ్వకాలు
- నిత్యం వందలాది లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు
- నదుల్లో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా దోచుకుంటున్న ప్రజాప్రతినిధులు
- పట్టించుకోని మైనింగ్, విజిలెన్స్ అధికారులు
- మామూళ్ల మత్తులో చూసీచూడనట్టు వదిలేస్తున్న వైనం
- వరదల నేపథ్యంలో స్టాక్ పాయింట్లలో 2.50 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయాల్సి ఉన్నా పట్టించుకోని అధికారులు
- బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి

జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



అచ్చంపేట మండలం కోనూరు రీచ్ నుంచి అధిక లోడ్‌తో తరలి వెళుతున్న లారీలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: ఉచిత ఇసుక మాటున కూటమి నేతలు రూ. కోట్లు వెనుకేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే ఇసుక రీచ్‌లలో అక్రమ రవాణా చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తు సహజ వనరులను అడ్డంగా దోచేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో కృష్ణానది పరివాహక రీచ్‌లలో ఈ దోపిడీ జరుగుతోంది. రాత్రి పూట వందల లారీలను సరిహద్దు దాటించి నిత్యం రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక సరఫరాలో ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఆదాయం రాకపోగా సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. మైనింగ్, విజిలెన్స్ అధికారులకు తెలిసే జరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలులేవు. అప్పుడప్పుడు అడపదడపా ఒకటి అరా లారీలను పట్టుకొని చేతులు దులుపుకుంటున్నారు.

రాత్రిళ్లు వందల లారీలతో...

అచ్చంపేట మండలంలో కోనూరు ఇసుక రీచ్ నుంచి ప్రతి రోజు 100 నుంచి 150 వరకు లారీలలో ఇసుక తరలి వెళుతోంది. ఒక్కో లారీలో 25 టన్నుల నుంచి 30 టన్నుల వరకు యంత్రాలతో ఇసుకను నింపుతున్నారు. ఒక్కొక్క లారీకి పొక్లెయిన్లతో నదిలో తవ్వి డంపింగ్ పాయింట్‌కు తరలించడానికి, అక్కటి నుంచి లారీకి నింపినందుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు తీసుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరగణం సహాయంతోనే ఇదంతా జరుగుతోంది. ఈ రీచ్‌కి అధికారులెవ్వరు వెళ్లరు, తనిఖీలు చేయరని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఎన్జీటీ ఆదేశాలు బేఖాతరు

పర్యావరణ నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌లలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయకూడదని ఎన్జీటీ ఆదేశాలున్నాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో వాటిని కాలరాస్తూ ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. అచ్చంపేట, అమరావతి మండలాల పరిధిలో కృష్ణానదికి అడ్డంగా రోడ్లు వేసి భారీ యంత్రాలను తరలించి రాత్రిళ్లు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు సాయంత్రం 6 గంటలనుంచి ఉదయం 6 గంటల వరకు ఇసుక కోసం నదిలోకి ఎటువంటి వాహనాలు దిగకూడదు. ఇసుక తవ్వకాలు ఏమాత్రం జరపకూడదు. అయితే ఇసుకాసురులు భారీ యంత్రాల సహాయంలో రాత్రి పూటి వందల కొద్దీలారీల ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

వరదొస్తే ఇసుకేదీ ?

కూటమి ప్రజాప్రతినిధులు ఓ వైపు ఇష్టానుసారంగా కృష్ణానదిలో ఇసుకను దోచుకుటుంటే ప్రభుత్వ అధికారులు మాత్రం మొద్దునిద్రలో ఉన్నారు. ఏటా వర్షాకాలంలో కృష్ణానదికి వరదలొస్తాయి. ఆ సమయంలో ఇసుక తవ్వకాలకు అటంకం కలుగుతుందని ముందస్తుగా ప్రభుత్వం ఇసుకను డంప్ చేసి ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తుంది. ఈ ఏడాది స్టాక్ పాయింట్‌లో 2.50 లక్షల టన్నుల ఇసుక నిల్వ చేయాల్సి ఉండగా సుమారు లక్ష టన్నుల ఇసుక మాత్రమే నిల్వ చేశారు. అందులోనూ 50 వేల టన్నుల వరకు ఇసుక వినియోగించారని సమాచారం. మిగిలిన 50 వేల టన్నుల ఇసుక అక్టోబర్ వరకు ఎలా సరిపోతుందన్నది ప్రశ్నగా మారింది.

కూటమి ట్రాక్టర్లకే అనుమతి

ప్రభుత్వం పేరుకు ఉచిత ఇసుక అని ప్రచారం చేసుకుంటున్నా సామాన్యుడికి అందడంలేదు. ట్రాక్టర్‌లతో ఇసుకను కూలీలతో తరలించడానికి ఉచితమే అయినా కొన్ని రీచ్‌లను స్థానిక కూటమి నేతలు ఆక్రమించి ట్రాక్టర్లకు ప్రవేశం లేకుండా చేస్తున్నారు. కేవలం కూటమి కార్యకర్తలకు చెందిన ట్రాక్టర్లనే నదిలోకి అనుమతించి ఇసుకను అనధికారికంగా డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ప్రజలకు, కాంట్రాక్టర్లకు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. కాదని సామాన్యులు రీచ్‌లలోకి ప్రవేశిస్తే మైనింగ్, విజిలెన్స్ అధికారులను పంపి బెదిరింపులకు దిగుతున్నారు.

'అడ్డ'దిడ్డంగా దోపిడీ



అచ్చంపేట మండలం కోనూరు ఇసుక రీచ్‌లో నదికి అడ్డంగా వేసిన రోడ్డు (ఫైల్)

ఈ రీచ్‌లో కృష్ణానదికి అడ్డంగా నదిలో రోడ్డు వేశారు. ఆ రోడ్డుపై నుంచే లారీలలో ఇసుకను తరలిస్తున్నారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ సంఖ్యలో ఇసుక లారీలు వెళుతుండటంతో దుమ్ములేస్తుందని స్థానికులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపుతున్నా ఎవ్వరూ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. చింతపల్లి రీచ్ నుంచి రాత్రిళ్లు లారీలలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. వీటికి బిల్లులు కానీ, ఎలాంటి అనుమతి పత్రాలుగానీ ఉండవు. మధ్యలో ఎవ్వరూ తనిఖీలు చేయరు. అమరావతి మండలంలోని గిడుగు, మల్లాది రీచ్‌లలో ఇదే పరిస్థితి నెలకొంది. రాత్రిళ్లు పదుల సంఖ్యలో లారీలతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో లారీ రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు సమాచారం.

పోలీసుల 'పచ్చ'పాతంపై నిరసన

గంట సేపు నిలబడి నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రి అంబటి, మాజీ ఎంపీ మోదుగుల, నేతలు



నగరంపాలెం: వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు ఏ చిన్న ఫిర్యాదు చేసినా కేసులు నమోదు, అరెస్టులు చేయడం, జైళ్లకు పంపించడం వెంటనే జరుగుతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. టీడీపీ మూకలపై వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఫిర్యాదులు చేస్తే కూటమి ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. గాంధీ మార్గం, ప్రజాస్వామ్య పద్ధతిలో సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ప్లకార్డులతో నిరసనకు దిగారు. నల్ల దుస్తులు ధరించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు 'నా ఫిర్యాదుపై చర్య తీసుకో ప్రార్థన' అనే ప్లకార్డు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి 'సత్యమేవ జయతే' అనే ప్లకార్డుతో గంటసేపు నిలువు కాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. నేతలు సైతం అదే బాట పట్టారు. అంబటి మాట్లాడుతూ పట్టాభిపురం పీఎస్‌లో గతేడాది డిసెంబర్ 12న సీమరాజు అనే వ్యక్తి సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లుగా మాజీ సీఎం వైఎస్ జగన్, తనపై, పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి అనరాని మాటలు అన్నాడని, పచ్చి బూతులు తిడుతున్నాడని ఆధారాల సహా ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

కూటమి సర్కారుపై పోరుబాట



మాట్లాడుతున్న పూనూరి గౌతంరెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు

- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి
- జంగమహేశ్వరపురంలో పోలు వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ

గురజాల: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని, దీనిపై పోరుబాట తప్పదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో సోమవారం నాగార్జున షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పోలు వెంకటరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతంరెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరపున ఒక్క సమావేశం కూడా ఏర్పాటు కాకూడదనే ఆలోచన కూటమి నాయకుల్లో ఉందన్నారు. మాచర్లలో సమావేశం జరగకుండా అడ్డుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. అక్రమంగా కేసులు, అరెస్టులు వంటి వాటితో నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు కూటమి నాయకుల కనుసన్నల్లో పనిచేస్తున్నారన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే అవకాశం కూడా లేకుండా ఈ విధంగా అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య వ్యతిరేక కార్యక్రమాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో చురుగ్గా ఉండే నాయకులు, కార్యకర్తలను అణచివేయాలనే ఆలోచన కూటమి నాయకుల్లో ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పనిలేదని అందరికీ తాము, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, వైఎస్సార్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవి), నగర పంచాయతీ మాజీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో పోలీసు జులుం

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభను అడ్డుకున్న పోలీసులు
- కార్యకర్తలు, నాయకులను అదుపులోకి తీసుకున్న వైనం
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకులు గౌతంరెడ్డి అడ్డగింత



నాయకులను హెచ్చరిస్తున్న పోలీసులు



కొత్తపల్లిలో కార్యక్రమానికి వెళ్తున్న గౌతంరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

మాచర్ల రూరల్: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరగకుండా పోలీసులు అడ్డుకొని పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న సంఘటన పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. వైఎస్సార్ సీపీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఎలాగైనా అడ్డుకోవాలనే అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు పోలీసులు కొత్తపల్లి గ్రామానికి చేరుకొని సభ జరగకుండా అడ్డుకున్నారు. గ్రామంలో నివాస గృహాల మధ్య సొంత స్థలంలో పార్టీ కార్యకర్తలు షామియానాలను ఏర్పాటు చేసుకొని సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమవ్వగా విజయపురిసౌత్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని సభా నిర్వహణకు అనుమతులు లేవని, పెట్టి పరిస్థితిలో సమావేశం జరపటానికి వీలు లేదంటూ హుకూం జారీ చేశారు. దీనిపై అక్కడే ఉన్న కార్యకర్తలు, నాయకులు తమ సొంత స్థలంలో పార్టీ ప్రోగ్రాం చేసుకునేందుకు ప్రత్యేక అనుమతులు అవసరమా.. గతంలో ప్రతిపక్ష నాయకులుగా ఉన్న టీడీపీవారు ప్రతి గ్రామంలో కార్యక్రమాలు చేసేటప్పుడు ఎటువంటి అనుమతులు పొందారని, ఇప్పుడు మమ్మల్ని ఇలా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం ఎంత వరకు సబబని వారు ప్రశ్నించారు. అయినా పోలీసులు వినిపించుకోకుండా సభా ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, ఇరువురిని అదుపులోకి తీసుకొని రూరల్ సర్కిల్ స్టేషన్‌కు తరలించారు.

గౌతంరెడ్డిని అడ్డుకున్న పోలీసులు

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు కొత్తపల్లి గ్రామానికి వచ్చిన వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. సభా నిర్వహణకు అనుమతులు లేవని, మీరు గ్రామంలోనికి రావద్దంటూ ఆయన్ను కారులోనే నిలిపివేశారు. ఆయన తీవ్రంగా స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పాలనను లోపాలను విమర్శించే హక్కును హరించడం బాగాలేదని.. కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించటం తగదంటూ సూచించారు. పోలీసులు అడ్డుకోవటంతో తిరిగి మాచర్లకు వచ్చారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం మేరకే..

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ పార్టీ ప్రోగ్రాంని కొత్తపల్లి గ్రామంలో జరగకుండా పోలీసులు ఆంక్షలు విధిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాచర్ల నియోజకవర్గంలో పక్కాగా అమలు పరుస్తున్నారని నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పూనూరి గౌతంరెడ్డి విమర్శించారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అదేవిధంగా మాచర్ల నియోజకవర్గానికి సంబంధించి కొత్తపల్లి గ్రామంలో జరుపుతుంటే పోలీసులను అడ్డుపెట్టుకుని సభను అడ్డుకోవటం దారుణమన్నారు. తమ సొంత స్థలంలో సభ జరుపుతుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం ఇక్కడ స్పష్టంగా అమలవుతుందని అర్థమవుతుందన్నారు.

- పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని నియోజకవర్గానికి రాకుండా అడ్డుకుంటున్నారని, అతి త్వరలో పీఆర్కే ఆధ్వర్యంలో మాచర్ల నడిబొడ్డున పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ లను ప్రజలకు వివరిస్తామన్నారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతురెడ్డి కోటిరెడ్డి, పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ తదితరులున్నారు.

బీసీ భవన్ స్థలానికి కోతలు వద్దు

- ఆ స్థలాన్ని మరెవరికీ కేటాయించవద్దు
- కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, బీసీ నాయకులు



బీసీ భవన్ స్థలానికి సంబంధించిన అనుమతి పత్రాలు చూపిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీ భవన్ నిర్మాణానికి ఇచ్చిన ప్రభుత్వ స్థలానికి ఎటువంటి కోత విధించవద్దని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో బీసీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండగా బీసీ భవన్‌కోసం కేటాయించిన స్థలంలో కోత విధించటం దురదృష్టకరమన్నారు. 2022లో అప్పటి కలెక్టర్ ఆదేశాలతో నాటి తహసీల్దార్ 15సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. అప్పుడు రాతపూర్వకంగా ఇచ్చిన అనుమతుల ప్రతులను మీడియాకు చూపించారు.

త్వరలో బీసీ భవన్ నిర్మించుకుంటాం

పట్టణంలో బీసీలు 60శాతంవరకు ఉన్నారని, వారు సమావేశాలు నిర్వహించుకునేందుకు బీసీ భవన్ చాలా అవసరమన్నారు. త్వరలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్థలాన్ని కాపాడుకుంటామన్నారు. ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి, బీసీ నాయకుడు ఈఎం స్వామి మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణం పూర్తిచేస్తామని అప్పటివరకు ఆ స్థలాన్ని మరేఇతర నిర్మాణాలకు ఇవ్వొద్దని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, బీసీ నేతలు మద్రిపూడి రాంబాబు, అట్లూరి బాలసుబ్రహ్మణ్యం, సాంబశివరావు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

పీజీఆర్ఎస్‌లో 207 అర్జీలు స్వీకరించిన కలెక్టర్



అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారులు నుంచి 207 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా, సంతృప్తే ధ్యేయంగా, రీఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. డీఆర్ఓ ఏకా మురళి, ఆర్డీఓ కె.మధులత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య కోళ్లఫారాలు తొలగించండి

నకరికల్లు గ్రామంలోని పాతూరులో నివాసం ఉండే మా ఇళ్ల మధ్య మూడు కోళ్ల ఫారాలను ఇటీవలనే నూతనంగా ఏర్పాటు చేశారు. దీని వలన దుర్వాసనతో చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ విషయం నిర్వాహకులకు చెబితే మీ ఇళ్లను తొలగిస్తామని మమ్మల్నే బెదిరిస్తున్నారు. వెంటనే ఆ కోళ్లఫారాలను తొలగించి మాకు న్యాయం చేయండి.

–పాతూరు గ్రామస్తులు, నకరికల్లు



విద్యుత్ లైను తొలగించాలి

వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి సాయిబాబా దేవాలయం నుంచి బ్రాహ్మణపల్లి తారురోడ్డు మధ్యలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైను రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఆ తీగెలు తొలగిస్తే కేసులు పెడతామని రైతులను బెదిరిస్తున్నారు. డిపాజిట్ కడితే విద్యుత్ స్తంభాలు తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులను అడగకుండా పొలాల గట్లు, కాలువ గట్లపై వేసిన వాటిని తొలగించాలంటే.. డబ్బులు కట్టమనటం దారుణం. వెంటనే తొలగించి ప్రమాదాలను నివారించాలి.

–వై.వెంకటేశ్వరరావు, రామారావు, పీడీఎం నాయకులు



క్లుప్తంగా

ఏపీ సార్వత్రిక ప్రవేశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్‌స్కూలు పదో తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు చెందిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. దీనిలో డీఈఓ ఎల్.చంద్రకళ, డీఆర్‌ఓ మురళి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు గడువు పెంపు

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం–2025 గాను అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపాదనలు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈనెల 17, ప్రతిపాదనల తుది సమర్పణకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడగించినట్లు వివరించారు. జిల్లాలోని డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు తమ పరిధిలోని ఉపాధ్యాయుల ప్రతిపాదనలను నిర్ణీతగడువులోగా http:// nationalawardsotŠreacherr .education.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని తెలిపారు.

'వన్ డే యాజ్ ఏ సైంటిస్ట్'కి సాయిరెడ్డి ఎంపిక



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కె.హెమంత్ సాయిరెడ్డి జాతీయ స్థాయిలో జరిగే అరుదైన 'వన్ డే యాజ్ ఏ సైంటిస్ట్' కార్యక్రమానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థి కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. హేమంత్ సాయిరెడ్డి హైదరాబాదులోని సీఎస్ఐఆర్ పరిశోధన సంస్థలో ఈ నెల 21న 'వన్ డే యాజ్ ఎ సైంటిస్ట్' గా పాల్గొంటాడు. శాస్త్రవేత్తలతో పని చేయడం, వారికి సహాయకుడిగా ఉండడం, ముఖాముఖీ, ప్రయోగాలు, ప్రయోగశాల పర్యటన, జీవ శాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రం, జీవకణ పరిశోధన వంటి అంశాలపై ప్రయోగ అనుభవం పొందడమే కాకుండా ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలతో మమేకం అయ్యే అవకాశం ఉంటుంది. ఇది భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా మారాలనే ప్రేరణనిచ్చే అవకాశం అవుతుంది. పల్నాడు నుంచి కార్యక్రమానికి ఎంపికైన హేమంత్ సాయిరెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ, ఉప విద్యాశాఖ అధికారి ఏసుబాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రత్యేకంగా అభినందించారు. జియాలజిస్ట్ డాక్టర్ ఎస్.కె సాయిబాబు, ఉపాధ్యాయులు, పీసీ వైస్ చైర్‌పర్సన్ బి.చంద్ర కుమారి, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు సాయిరెడ్డిని అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యాలపై సమరభేరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు, పక్కన ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

- సర్కారు మోసాలను ఎండగడదాం
- వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు
- గురజాలలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' సభకు స్పందన
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

గురజాల: సూపర్ సిక్స్ పథకాలతో పాటు 143 వాగ్దానాలు ఇచ్చి, వాటి అమలులో ఘోరంగా విఫలమైన ప్రభుత్వంపై సమర భేరి మోగిద్దామని వైఎస్సార్ సీపీ గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పిలుపునిచ్చారు. గురజాలలో సోమవారం పార్టీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ మోసపూరితమైన హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. తీరా గద్దె ఎక్కాక వాటిని నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. మొదటి నుంచి చంద్రబాబుకు మోసం చేసే అలవాటుందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గ్రామాల్లోకి తీసుకువచ్చి పాలన సౌలభ్యం అందించిందని వివరించారు. సంపద సృష్టిస్తామని చెప్పి చంద్రబాబు దాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రూ.1,63,000 కోట్లు అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు. ఇన్ని అప్పులు చేసినా ప్రజలకు మాత్రం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని తెలిపారు. పేదల పక్షాన ఉన్న నాయకుడు జగన్ అయితే, పేదలను వంచించే నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధికి కూటమి నాయకులు కొబ్బరి కాయలు కొట్టి మళ్లీ ప్రారంభిస్తున్నారని తెలిపారు. మెడికల్ కళాశాల, జానపాడు రైల్వే బ్రిడ్జి , సిమెంటు కర్మాగారం మూసి వేశారని, సెల్ఫీల ద్వారా పోరాటం చేస్తే వెంటనే పనులు ప్రారంభించారని మహేశ్‌రెడ్డి గుర్తు చేశారు.

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు

మాజీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సైతం కూటమి నాయకులు అలజడులు సృష్టించి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డి తమలో ధైర్యం నింపారని, కార్యకర్తల్లో నింపేందుకు వచ్చామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

కలసికట్టుగా ఉండాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులంతా కలసికట్టుగా ఉంటూ పోరాటం చేస్తే విజయం సాధించవచ్చని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, చంద్రబాబునాయుడుది మోసం చేసే నైజమని ధ్వజమెత్తారు. గ్రామ స్థాయి నుంచి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ భయపడకుండా గ్రామాల్లో ముందుకు పోవాలని తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. గ్రామాల్లో రచ్చబండలను ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి, కూటమి నేతలు చేసిన అభివృద్ధిని వివరించాలని తెలిపారు. గ్రామ స్థాయి నుంచే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, పట్టణ కన్వీనర్ కె. అన్నారావు, వేముల చలమయ్య, మాజీ మండల కన్వీనర్ సిద్ధాద్దాడపు గాంధీ, కలకండ ఆంద్రెయ్య, కర్రా చినకోటేశ్వరరావు, యశోద దుర్గా, మన్నెం ప్రసాద్, కొమ్మినేని రవిశంకర్, షేక్ నాగులు మీరా, వలి, పీర్ అహ్మద్ పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

- జిల్లా ఎస్పీకి దుర్గి మహిళ ఫిర్యాదు
- పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 75 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల నుంచి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: మేలిమి బంగారం చూపించి రూ.15లక్షలు తీసుకొని ఆ తర్వాత నకిలీది అంటకట్టి అజ్ఞాత వ్యక్తి మోసం చేశాడంటూ ఓ మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 75 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో మోసాలు, కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు సమస్యలు ఉన్నాయి. వాటిలో కొన్ని ...

మోసపోయాం

నా భర్త మృతిచెందగా అతని పేరుపై ఉన్న ఫోన్ నంబరు వాడుతున్నా. దానిని ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి తన వద్ద బంగారం ఉందని, పరీక్ష చేయించుకునేందుకు రెండు కాయిన్స్ ఇస్తానని ఫోన్‌లో చెప్పాడు. ఆ విషయం నా చెల్లెలి భర్తతో మాట్లాడించగా, బళ్లారి రమ్మని కోరాడు. రెండు కాయిన్స్ తెచ్చుకొని నేను, నా చెల్లెలు భర్త హైదరాబాదులో పరీక్ష చేయించాం. అది మేలిమి బంగారమని తేలింది. దీంతో ఆ వ్యక్తిపై మాకు నమ్మకం కుదిరింది. ఇద్దరం మళ్లా బళ్లారి వెళ్లి రూ.15లక్షలు చెల్లించి 250 గ్రాముల బంగారాన్ని కొనుగోలు చేశాం. దానిని తీసుకొచ్చి హైదరాబాదులో టెస్ట్ చేయించగా నకిలీ బంగారమని తేలింది. అప్పటి నుంచి ఆ అజ్ఞాత వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయింది. మోసం చేసిన వ్యక్తిని పట్టుకొని మా డబ్బులు ఇప్పించండి.

–షేక్ జానీ బేగం, దుర్గి

విడాకులు ఇవ్వకపోతే చంపుతానంటున్న భర్త

నాకు ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. ప్రస్తుతం గురజాలలో ఏఎన్ఎంగా పని చేస్తున్నా. వివాహం జరిగినప్పటి నుంచి పిల్లలు కలగలేదు. దీంతో భర్త వెంకట జనార్దనరావు, అత్తమామలు అనేక సార్లు శారీరకంగా మానసికంగా వేధించారు. నా భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని బిడ్డను కన్నాడు. దీంతో వివాహ సందర్భంగా ఇచ్చిన రూ.10లక్షల కట్నం, బంగారం తిరిగి ఇస్తామని ఒప్పుకోవడంతో అత్తగారింటికి వెళ్లా. అయినప్పటికీ ఆ డబ్బులు, బంగారం ఇవ్వకుండా సామాన్లు బయటకు వేశారు. దీంతో పాటు నేను ఉద్యోగం చేసుకుంటున్న చోటుకు వచ్చి విడాకులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోండి.

– ఏఎన్ఎం, గురజాల

డబ్బులు చెల్లించమని వేధిస్తున్నారు

2022 అక్టోబరులో చోళ ఫైనాన్స్‌లో ఇంటి నిర్మాణం కోసం రూ.1.60లక్షలు తీసుకున్నా. అయితే నా భర్త అకస్మాత్తుగా చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. నాకు ఇద్దరు ఆడపిల్లలు. తీసుకున్న డబ్బులు కట్టమని ఇద్దరు వ్యక్తులు వచ్చి వేధిస్తున్నారు. రాత్రులు ఇంటికి వచ్చి రకరకాలుగా దుర్భాషలాడుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–చెరుకూరి నాగలక్ష్మి, నాగవరం, క్రోసూరు మండలం

రుణం ఇప్పిస్తామని డబ్బులు వసూలు

సత్తెనపల్లి పట్టణానికి చెందిన రవికుమార్, వెంకటేష్, అనిల్‌లు ఏపీటీబీఎంఎంఎస్ స్కీంలో రుణం ఇప్పిస్తామని నమ్మబలికారు. దఫాల వారీగా నా వద్ద నుంచి రూ.1.65లక్షలు గూగుల్ పే ద్వారా తీసుకున్నారు. అయితే, రుణం ఇప్పించలేదు. తిరిగి డబ్బులు కూడా ఇవ్వలేదు. అదేమని అడిగితే దౌర్జన్యానికి దిగి చంపుతామని బెదిరిస్తున్నారు. నిజనిర్ధారణ జరిపించి నాకు న్యాయం చేయండి

–కొత్త శివన్నారాయణ, పిడుగురాళ్ల

పోక్సో కేసు రాజీ కోసం పోలీసుల వేధింపులు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, బాధిత కుటుంబ సభ్యుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి వినతి



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు

నరసరావుపేట: ఓ బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు పెట్టిన తల్లిదండ్రులను రాజీ కోసం కొట్టి హింసించి వేధిస్తున్న నరసరావుపేట రూరల్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి అదనపు ఎస్పీ జేవీ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. నాదెండ్ల గౌరిజపోలుకు చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండెబోయిన శ్రీనివాసరావు నరసరావుపేట మండలంలోని దొండపాడులో ఓ యువతి వివాహం చేసుకున్నాడని, వారికి 17ఏళ్ల మైనర్ బాలిక ఉందని తెలిపారు. గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆమెను ప్రతిరోజు వెంటపడుతూ వేధిస్తున్నాడని చెప్పారు. దీంతో ఆ బాలికను అమ్మమ్మ ఊరు దొండపాడులో ఉంచారని వివరించారు. యువకుడు ఈ విషయం తెలుసుకొని దొండపాడు వచ్చి వెళుతుండటంతో ఆ బాలిక సోదరుడు, గ్రామస్తులు కలిసి మందలించి పంపించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ మైనర్ బాలిక మానసికంగా కుంగిపోయి పురుగు మందు తాగగా ప్రభుత్వాసుపత్రిలో చేర్చారని తెలిపారు. చికిత్స పొందుతున్న సమయంలో పోలీసులు బాలిక నుంచి రిపోర్టు తీసుకొని ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారని గోపిరెడ్డి చెప్పారు. ఆ బాలిక 11రోజులపాటు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకుందన్నారు. అయితే, ఆ కేసును తప్పించుకునేందుకు రాజీ కోసం తల్లితండ్రులు కుమారుడు అదృశ్యమయ్యాడనే ఫిర్యాదును నరసరావుపేట రూరల్ పోలీసులకు ఇచ్చారని చెప్పారు. కేసులో తప్పకుండా శిక్ష పడుతుందనే ఉద్దేశంతో నెల రోజుల నుంచి బాలిక తల్లితండ్రులు, సోదరుడితో పాటు గ్రామస్తులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి వేధించటం ప్రారంభించారని గోపిరెడ్డి ఆరోపించారు. బాలిక సోదరుడిని పోలీసుస్టేషన్‌కు పిలిచి కొట్టారన్నారు. శరీరంపై పడిన దెబ్బల మచ్చలను మీడియాకు చూపించారు. పోలీసులు ఈ విధంగా వ్యవహరించటం దారుణమని ఆయన ఖండించారు. బెంగుళూరు, తిరుపతి ప్రదేశాల్లో ఆ యువకుడిని దాచిపెట్టి రాజీకోసం ఈవిధంగా తప్పుడు కేసులు పెట్టి బాధిత కుటుంబాన్ని వేధించటం రెడ్‌బుక్ రాజ్యాంగానికి పరాకాష్ట అని గోపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు పక్షాన నిలబడాల్సిన పోలీసులు ఒక్కపార్టీ వైపే ఉండటం చాలా దారుణమని ఆయన విమర్శించారు. ఎస్పీ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బాధిత కుటుంబం సభ్యుడైన శ్రీనివాసరావు మీడియాతో జరిగిన విషయం చెప్పారు. కార్యక్రమంలో దొండపాడు గ్రామ సర్పంచ్ జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాధిత బాలిక కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈఎం. స్వామి, షేక్ కరిముల్లా, సుబ్రహ్మణ్యం నాయిూ పాల్గొన్నారు.

సిటిజన్ సర్వీస్ డెలివరీ అవార్డుకు నరసింహారావు ఎంపిక



యడ్లపాడు: ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో, సమర్థంగా అందించినందుకు గానూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అందజేసే ప్రతిష్టాత్మక సిటిజన్ సర్వీస్ డెలివరీ అవార్డ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఇందులో శ్రీకాకుళం జిల్లావాసి ఒకరు కాగా, పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలేనికి చెందిన వడ్డేపల్లి నరసింహారావు మరొకరు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సాంకేతికతను చేరవేస్తూ, ప్రభుత్వ పథకాలను వారికి తక్కువ సమయంలో అందుబాటులోకి తేవడంలో నరసింహారావు కీలక పాత్ర వహించారు. బోయపాలెంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ను నెలకొల్పి, నిరంతరంగా సేవలందిస్తూ గ్రామస్తుల విశ్వాసాన్ని గెలుచుకున్నారు. ఆధార్ సేవలు, పింఛన్ నమోదులు, బ్యాంకింగ్ సేవలు, విద్యా సేవలు.. ఇలా అనేక రంగాల్లో ప్రజలకు సేవలందించారు. ఈనెల 16న న్యూఢిల్లీలో జరుగనున్న 16వ సీఎస్‌సీ దివస్ వేడుకలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రైల్వే మంత్రి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 28 మందికి సత్కారం జరుగనుంది. వారికి విమాన టికెట్లు, వసతి, ఇతర ఏర్పాట్లు ఇప్పటికే చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం నరసింహారావు వంకాయలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



జెడ్పీ కార్యాలయం వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం జెడ్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగి కస్తూరి కృష్ణవేణి మాట్లాడుతూ జెడ్పీ కార్యాలయంతో పాటు చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో స్వీపర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. తనతో పాటు తేళ్ల హరీష్, వాసిమళ్ల అరుణ, కొల్లిపర రాహుల్, కె.ఆనంద్, వరికూటి నందినిలకుగత 22 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద ప్రేమానందం మాదిగ మాట్లాడుదూ జెడ్పీ సీఈవో, డెప్యూటీ సీఈవో నిర్లక్ష్య వైఖరితోనే వేతనాలు చెల్లింపులకు నోచుకోవడం లేదని ఆరోపించారు. వాచ్‌మేన్‌గా పని చేస్తున్న పిడపర్తి కృష్ణవేణి భర్త అనారోగ్యంతో మరణించగా, కనీసం ఆ కుటుంబాన్ని ఆదుకోకపోగా ఆమెకు 22 నెలల జీతం కూడా ఆపేశారని ఆరోపించారు. నిరుపేద కార్మికులపై అధికారులు నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్రాహ్మణ సమాజానికి అండగా ఉంటాం



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

ఉపాధ్యక్షుడు దండెంరాజు వెంకట హనుమంతరావు

మాచర్ల రూరల్: అట్టడుగున ఉన్న బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన దండెంరాజు వెంకట హనుమంతరావు అన్నారు. సోమవారం నెల్లూరులో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ సమాజాభివృద్ధికి నూతన కార్యవర్గం ప్రతిజ్ఞ బంధంగా పని చేస్తుందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వ పథకాలతో పాటు సంఘ పెద్దల సహకారంతో చేయూతనందిస్తామని చెప్పారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పునరుద్ధరణపై ప్రభుత్వంతో చర్చిస్తామని పేర్కొన్నారు.

యువజన ప్రధాన కార్యదర్శిగా వెంకట సుబ్బారావు

మాచర్లకు చెందిన యండపల్లి వెంకట సుబ్బారావు యువజన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అర్చక వృత్తిలో ఉన్నవారికి వేద పాఠశాలలో శిక్షణతో వారి ఉన్నతికి సహాయ సహకారాలందిస్తానని చెప్పారు. సమావేశంలో సంఘ నాయకులు బలరామకృష్ణమూర్తి, ముత్తనపల్లి శివరామకృష్ణ ప్రసాద్, రామరాజు, వాసుదేవరావు, మాధవరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి చేదు అనుభవం

సొంత పార్టీ వారే అసంతృప్తి



నరసరావుపేట: నాదెండ్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు చేదు అనుభవం ఎదురైంది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో నారాయణస్వామి మఠం ఏరియాలో పర్యటించారు. ఈ సమయంలో టీడీపీ కార్యకర్తలు అసంతృప్తి వెళ్లగక్కారు. పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు అధికారులు కొనుగోలు చేయకుండా, తక్కువ ధరతో రైతులను మోసగిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. నిబంధనల పేరిట పొగాకును తిరస్కరిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అంతేకాక గ్రామంలో చోరీలు అధికంగా జరుగుతున్నాయని, ఇప్పటికే సుమారు 10కి పైగా బైకులు చోరీకి గురయ్యాయని ఆయన దృష్టికి తెచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామస్తులు సమస్యలను వివరిస్తుండగానే ఎమ్మెల్యే పుల్లారావు పట్టించుకోకుండా కారు ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తున్నట్టు పల్నాడుజిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మానం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సి.సి.ఆదెయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ సవరణను రద్దు చేయాలనీ, కేంద్రంలో 8వ పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వ పెన్షనర్లు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.